క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి సహాయం



ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన ఖండ్యాన శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఆయన భార్య మహేశ్వరి, కుమారుడు వసంత్, బాలాజీ కుటుంబ సభ్యులు రూ.51,116 ఆర్థిక సహాయం చేశారు. గురువారం వారి నివాసంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంట్యాడ: రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొఠారుబిల్లి, కితుబర్తి, పెణసాం, చినమానపురం, బుడతానపల్లి, నరవ, నీలావతి, జగ్గాపురం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెలివాడ ఫీడర్ పరిధిలో..

బొండపల్లి: మండలంలోని నెలివాడ ఫీడర్ పరిధిలోని నెలివాడ, కెరటాం గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈఈ ఆర్.శంకరరావు గురువాం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మ లను తొలగించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మృతుని కుటుంబానికి సాయం



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న ప్రజ్వల్ సేవా కమిటీ సభ్యులు

శృంగవరపుకోట: స్థానిక బర్మాకాలనీకి చెందిన పెయింటర్ బంగారి సూరి కొద్ది రోజుల క్రితం విజయనగరం నుంచి వస్తూ గంట్యాడ టోల్‌గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు.ఆయన కుటుంబానికి ప్రజ్వల్ సేవా కమిటీ సభ్యులు గురువారం రూ.7,500 ఆర్థిక సాయం అందజేశారు.కార్యక్రమంలో సేవా కమిటీ సభ్యులు మజ్జి శేఖర్, నానిగిరి కృష్ణ, మోపాడ సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ సందర్శన



స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ గురువారం సాయంత్రం సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్రవాహనాలను పరిశీలించారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. డీఎస్పీ కల్యాణ చక్రవర్తి, సీఐ షణ్ముఖరావు, ఎస్ఐ ఎల్.దామోదరరావు తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



మెరకముడిదాం తహసీల్దార్ రఫీజాన్



గజపతినగరం తహసీల్దార్ రత్నకుమార్

మెరకముడిదాం: మండల తహసీల్దార్‌గా రఫీజాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బాడంగి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇదివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వై.వి.పద్మావతి కొద్దిరోజుల క్రితమే శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. తహసీల్దార్ రఫీజాన్‌కు డిప్యూటీ తహసీల్దార్ గిరిధర్, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

గజపతినగరం తహసీల్దార్‌గా రత్నకుమార్

గజపతినగరం రూరల్: మండల తహసీల్దార్‌గా బొంతు రత్నకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి సీతారామ రాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. డీటీ సత్యనారాయణ, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. విధుల్లో చేరిన వెంటనే రికార్డు రూమ్‌ను ను పరిశీలించారు. కార్యాలయంలో చేపట్టాల్సిన మరమ్మతులపై సిబ్బందికి సూచనలు చేశారు.

తల్లిపాలే బిడ్డకు తొలి వ్యాధినిరోధక టీకా

- ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు



గుర్ల: గుర్లలో ర్యాలీ చేస్తున్న వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది

జామి: పుట్టిన వెంటనే బిడ్డకు అందించే తల్లి ముర్రు పాలు మొట్టమొదటి వ్యాధి నిరోధక టీకాతో సమానమని, ఆర్నెళ్ల వయసు వరకు బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.సునీత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత వివరించారు. జామి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే లొట్లపల్లి, అలమండ గ్రామాల్లో అల మండ పీహెచ్‌సీ వైద్యాధికారి కె.వి.ఎస్.పద్మావతి ఆధ్వర్యంలో తల్లిపాల ఆవశ్యకత, పరిశుభ్రతపై అవగాహన కల్పిం చారు. వైద్యసిబ్బంది నారాయణరావు తదితరు లు పాల్గొన్నారు.

తల్లి పాలు అమృతం

గుర్ల: బిడ్డకు తల్లిపాలే అమృతమని గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నయ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గుర్ల పీహెచ్‌సీలో బాలింతలు, గర్భిణులకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు అందిస్తేనే వారి శారీరక, మానసిక ఎదుగుదల బాగుంటుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వ హించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

బొండపల్లి: తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ డి.ఉమాభారతి అన్నారు.తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని గొట్లాం గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో బిడ్డకు కావాల్సిన పోషకాలు అన్నీ ఉంటాయని, తద్వారా బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఐసీడీ ఎస్ సూపర్ వైజర్ టి.జానకి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బిడ్డకు ఆరోగ్యం..

దత్తిరాజేరు: నవజాత శిశువుకు ఆర్నెళ్ల వరకు తల్లిపాలు పట్టించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అపర్ణరాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కె.కృష్ణాపురం, కొత్తవలస గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు గురువారం అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.



జామి: జామిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత



దత్తిరాజేరు: కోరపు కృష్ణాపురంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అపర్ణరాణి



జామి: లొట్లపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పద్మావతి



బొండపల్లి: గొట్లాంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కులగణన తర్వాతే వర్గీకరణ చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న అంబేడ్కర్ ఉద్యమ పోరాట సమితి నాయకులు

చీపురుపల్లి: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు వర్గీకరణ బాధ్యత అప్పగించి న నేపథ్యం లో ఎస్సీ కులగణన చేసిన తర్వాతే వర్గీకరణ చేయాలని అంబేడ్కర్ ఉద్యమ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశా రు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఈ మేరకు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.అయితే కూటమి ప్రభుత్వం ఈసమయంలో రాజకీయం చేయకుండా ముందుగా ఎస్సీ కులగణన చేపట్టాలన్నారు. రాష్ట్రంలో అధికంగా ఉన్న మాల కులస్తులు కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు పెట్టుకుని వర్గీకరణకు వెళ్లాలని కోరారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఇప్పటికే కుల, మతతత్వ పార్టీగా ముద్ర వేసుకుందని, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా అలా ముద్ర వేసుకోవద్దని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ సోదరులు అంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, మాల కులస్తులు మాత్రమే కూటమి ప్రభుత్వం వైపు ఉన్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికితే రాష్ట్రం రావణకాష్టంగా మారుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం వర్గీకరణకు వెళితే రాష్ట్ర వ్యాప్తంగా మాల కులస్తులు కూటమికి దూరమయ్యే అవకాశం ఉందని స్పష్టం చేశారు. సంఘ నాయకులు అడ్డూరి కృష్ణ, ఆర్.రామకృష్ణ, సబ్బి సత్యనారాయణ, టి.సంజీవిరావు, బి.సూర్యనారాయణ, సిమ్మాల దుర్గాప్రసాద్, ఎం.విజయ్‌కుమార్, ఎస్.రాంబాబు, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులకు సహాయనిధి సేకరణ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కేరళ వరద బాధితులకు గురువారం సహాయనిధిని సేకరించారు. అలాగే పర్యావ రణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు మాట్లాడుతూ కేరళ విపత్తు భారతదేశంలో అతిపెద్ద విపత్తుల్లో ఒకటని, కష్టాల్లో ఉన్న వారికి చేదోడు వాదోడుగా ఉండాల్సిన అవసరం ఏంతైనా ఉందని అన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ జి.ఈరన్న, అధ్యాపకులు పిభాస్కరరావు, ఎస్.కె. వలీఖాన్, సీహెచ్. శ్రీనివాసరావు , అప్పలరాజు, డి.లక్ష్మణ్, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



గుర్ల మండల సమాచారాన్ని ఎస్పీ వకూల్ జిందాల్‌కు వివరిస్తున్న ఎస్ఐ భాస్కరరావు

గుర్ల: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గుర్ల పోలీసులకు ఎస్పీ వకూల్ జిందాల్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులను, లాకప్ గదులను, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి, కారకులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ చక్రవర్తి, సీఐ షణ్ముఖరావు, ఎస్ఐ భాస్కరరావు ఉన్నారు.

రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు,వైఎస్సార్‌సీపీ నాయకులు

దత్తిరాజేరు: మండలంలో రెవెన్యూ పరమైన సమస్యలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విజయభాస్కర్‌ను రెవెన్యూ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి అప్పలనాయుడు, కడుబండి రమేష్‌నాయుడు, మహదేవ్ ఫణీంద్రుడు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



మెరకముడిదాం: వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు



ఎల్.కోట: సీతారాంపురంలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ అంబేడ్కర్



కొత్తవలస: చింతలపాలెంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లి, సోమలింగాపురం, మెరకముడిదాం గ్రామాల్లో ఆగస్టు నెలకు సంబంధించి సచివాలయ సిబ్బంది గురు వారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లను పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని అన్నారు.అలాగే సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య,నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు, కెంగువ ధనుంజయ, మండల రమణ, మోహన్‌రావు, ఎస్.రమణరాజు, ఎం.బంగార్రాజు, ఎస్. వెంకటపతిరాజు పాల్గొన్నారు.

పరిశీలన

లక్కవరపుకోట/కొత్తవలస: లక్కవరపుకోట మండలంలోని సీతారాంపురం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ పరిశీలించారు. కొత్తవలస మండలంలోని చింతలపాలెం,రామలింగపురం గ్రామాల్లో వృద్ధులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పింఛన్లు పంపిణీ చేశారు. రెండు మండలాల తహసీల్దార్‌లు ప్రసాద్ రావు, నీలకంఠరావు, ఎంపీడీఓలు రూపేష్, రమణయ్య, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.కార్తీక్ పరిశీలించారు. రెండు రోజుల్లో శత శాతం పంపిణీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మండల ప్రత్యేక అధికారి ఎన్.వి.కె.దుర్గా ప్రసాద్,ఎంపీడీఓ ఎస్.హరిహరరావు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మండలంలో పింఛన్ల పంపిణీ 98 శాతం పూర్తయిందని ఎంపీడీఓ చంద్రకుమారి గురువారం తెలిపారు. దత్తి గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారి జోసఫ్ పరిశీలించారు.

వేపాడ: మండలంలోని ముకుందపురం, ఓబలయ్యపాలెం, పాటూరు, సోంపురం,శింగరాయి తదితర గ్రామాల్లో పింఛన్ల పంపిణీని మండల నోడల్ అధికారి పి.ఎన్.వి. లక్ష్మీనారాయణ పరిశీలించారు. పలువురికి ఆయనే స్వయంగా పింఛన్ డబ్బులు అందజేశారు.

వరి నాట్లపై అవగాహన



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ రవీంద్ర

శృంగవరపుకోట: మండలంలో వశి గ్రామంలో రైతులకు వరినాట్లు వేసే విధానంపై రైతులకు ఏఓ కె.రవీంద్ర గురువారం అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన లెక్కల జోజిబాబు పొలంలో వరినారు చిగుర్లు తుంచి నాట్లు వేయించారు. చిగుర్లు తుంచి నాట్లువేయటంవల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. వరి నారు ఉడిచేటప్పుడు 20 మీటర్లకు ఒక వరుస కాలిబాటలు తీయడం వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా తగులుతుందని, చీడపీడలు పంటను ఆశించవని చెప్పారు. వీఏఏలు రవీ, వివేక్, వశి పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

వేపాడ: ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ-2 బాలభాస్కరరావు గురువారం తనిఖీలు నిర్వహించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల హాజరు రికార్డు, వర్క్‌బుక్‌లు, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్‌ను పరిశీలించారు. విద్యార్థుల దస్తూరీ మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

జగన్ హయాంలో ప్రభుత్వ విద్యకు పెద్దపీట



విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ శిరీష, నాయకులు

చీపురుపల్లి: ప్రభుత్వ విద్యకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం నోట్‌బుక్స్, బ్యాగ్‌లు పంపిణీ చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రత్యేక శ్రద్ధతో చీపురుపల్లిలో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నికల్ కళాశాల లు ఏర్పాటు చేశారని చెప్పారు.ఈప్రాంతం విద్యార్థులు డిగ్రీ చదువుకోవాలంటే విజయనగరం, విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేదన్నారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసమే 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రభు త్వ డిగ్రీ కళాశాలను తీసుకొచ్చినట్లు చెప్పారు. అదే కళాశాల ఆవరణలో బాలుర, బాలికల వసతిగృహాలు మంజూరు చేసి విద్యార్థులకు సదుపాయాలు కల్పించామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జూనియర్ కళాశాలను నాడు-నేడు పథకంలో చేర్చి రూ.85 లక్షలు నిధులు జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని గుర్తు చేశారు. ఇదే కళాశాల మైదానంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఎంపీ నిధులు రూ.10 లక్షలతో రన్నింగ్, జాగింగ్ ట్రాక్ పనులు చేయించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, నాయకులు పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, గిరిడ రాందాసు, కరిమజ్జి శ్రీను, కోరుకొండ దాలయ్య, కరణం ఆది, గవిడి సురేష్, ముల్లు పైడిరాజు, రేవల్ల సత్తిబాబు పాల్గొన్నారు.

ముంచేశాడు..ఉరి వేసుకున్నాడు

- హోటల్ నిర్వాహకుడి ఆత్మహత్య వెనుక అప్పుల ఆవేదన
- రూ.కోటికి పైగా బయటకొస్తున్న అప్పుల చిట్టా



రాజమండ్రి అడ్రస్ పేరుతో ఉన్న రవికుమార్ ఆధార్‌కార్డు

చీపురుపల్లి: ఎక్కడి నుంచి వచ్చాడో తెలియదు నాలుగేళ్లుగా చీపురుపల్లి పట్టణంలో హోటల్ నిర్వహిస్తూ అందరితో మంచిగా మెలిగేవాడు. హోటల్‌కు వచ్చే వారిని ఆప్యా యంగా పలకరించేవాడు, అవసరమైతే పార్టీలు ఏర్పాటు చేసేవాడు, అదే అదునుగా ఒకరికి తెలియకుండా మరొకరి దగ్గర అప్పులు చేసేశాడు. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.కోటి దాటి అప్పులు చేసేశాడు. ఇంకా కొంతమంది బయటకు రాలేక ఉండిపోయిన వారున్నారు. పట్టణంలోని కొత్తగవిడివీధిలో బుధవారం ఆత్మహ త్యకు పాల్పడిన ఎస్ఆర్‌కే వింగ్స్ హోటల్ నిర్వాహకుడు చింతా రవికుమార్ వెనుక చాలా విషయాలు బయటకొస్తున్నాయి.ఆయన మృతి చెందిన 24 గంటల గడవక ముందే రూ.కోటి పైగా అప్పుల చిట్టాలు బయటపడ్డాయి. తమకు డబ్బులు ఇవ్వాలంటే తమకు ఇవ్వాలంటూ కొంత మంది బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. చీపురుపల్లి వచ్చిన నాలుగేళ్లలోనే ఎంతో మందిని నమ్మించి అప్పులు చేసి అందరినీ నిండా ముంచేసి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఊరు, పేరు, ఎక్కడి నుంచి వచ్చాడో తెలుసుకోకుండా వెనుక ముందు ఎవరూ లేకుండా ఇంత డబ్బు అప్పు ఎలా ఇచ్చారో అనే చర్చ జరుగుతోంది. మంచిగా ఉంటూ డబ్బు అప్పు తీసుకుని ఇలా ఆత్మహత్య చేసుకోవడంపై బాధితులు కక్కలేక మింగలేక లబోదిబోమంటున్నారు.

ప్రాంతాలు మారుతూ....ఆధార్‌కార్డులు మార్చుతూ.

ఆత్మహత్యకు పాల్పడిన రవికుమార్ ఎక్కడి నుంచి వచ్చాడో ఎవ్వరికీ తెలియదు. నాలుగేళ్ల క్రితం ఆయన దగ్గర నాయని రవిరాజ్‌కుమార్, ఇన్నీస్‌పేట, రాజమండ్రి అడ్రస్‌తో ఒక ఆధార్‌కార్డు ఉండేది. చీపురుపల్లి వచ్చాక చింతా రవికుమార్, కొత్తగవిడివీధి, చీపురుపల్లి అడ్రస్‌తో కొత్త ఆధార్ కార్డు చేయించుకున్నాడు. దీని ప్రకారం ఆయన చాలా ప్రాంతాలు మారి ఉంటాడని, వెళ్లిన ప్రతీ చోటా ఇదే పరిస్థితులు ఉండి ఉండొచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు.

హిందూపురం అడ్రస్‌తో ఫోన్ నంబర్....

ఇది ఇలా ఉండగా మృతుడు రవికుమార్ వినియోగిస్తున్న ఫోన్ నంబర్ ప్రకారం తన వివరాలు ఆరా తీసేందుకు ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు ప్రయత్నించారు. అయితే ఆ ఫోన్ నంబర్ అడ్రస్ అనంతపురం జిల్లాలోని హిందూపురం పేరుతో ఉంది. ఆ అడ్రస్‌లో ఉన్న ఫోన్ నంబర్‌కు ఫోన్ చేస్తున్నప్పటికీ కొన్ని సార్లు రింగ్ అవ్వగా తర్వాత స్విచ్ ఆఫ్ వచ్చింది. ఇదే విషయమై ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ అప్పుల బాధితుల సంఖ్య పెరుగుతోందన్నారు. మృతుడు స్వస్థలం, కుటుంబం కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ ఎలాంటి సమాచారం లభించడం లేదన్నారు. రాజమండ్రి పేరుతో ఉన్న ఆధార్‌కార్డు ప్రకారం అక్కడ అడ్రస్ ఆరా తీశామని కానీ అక్కడ ఎవ్వరూ తెలియదంటున్నారని తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



శృంగవరపుకోట: ఎస్.జి.పేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలచేస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు



వేపాడ: సోంపురం ఉన్నత పాఠశాలల నోటిఫికేషన్ నోటీస్‌బోర్డులో అతికించిన ఎంఈఓ బాలభాస్కరావు, హెచ్‌ఎం రాజు



గజపతినగరం: బాలుర హైస్కూల్‌లో నోటిఫికేషన్ విడుదల చేస్తున్న హెచ్ఎం వెంకటేశ్వరరావు,ఉపాధ్యాయులు



మెరకముడిదాం: ఉత్తరావల్లి ప్రాథమిక పాఠశాలలో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

ప్రభుత్వ పాఠశాల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటి (ఎస్ఎంసీ) ఎన్నికలకు సంబంధించి పాఠశాలల హెచ్ఎంలు గురువారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. పాఠశాలల నోటీస్ బోర్డుల్లో ఎన్నికల నోటిఫికేషన్, తల్లిదండ్రుల పేర్లతో జాబితాను అతికించారు. 5న అభ్యంతరాల స్వీకరణ, తుదిజాబితా ఈనెల 8వ తేదీన విడుదల చేసి, అదే రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు, హెచ్ఎంలు తెలిపారు. వేపాడ మండలంలోని 54 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు జరుగుతాయని సోంపురం, వేపాడ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసిన ఎంఈఓ బాల భాస్కరరావు తెలిపారు. గజపతినగరం బాలుర హైస్కూల్ హెచ్ఎం బి.వెంకటేశ్వరరావు ఎన్నికలనోటిఫికేషన్, తల్లిదండ్రుల జాబితాను పాఠశాల, గ్రామసచివాలయాల నోటీస్ బోర్డుల్లో అతికించారు.మెరకముడిదాం మండలంలోని ఉత్తరావల్లి ప్రాథమికపాఠశాలలో ఎంఈఓ చంద్రశేఖర్, గర్భాం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.ఎస్. ఆర్.ఆచార్యులు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు.శృంగవరపుకోట మండలంలో 47 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలకు సంబందించిన నోటీఫికేషన్ విడుదలచేశామని ఎంఈఓలు తెలిపారు.

– వేపాడ/మెరకముడిదాం / గజపతినగరం/ మెరకముడిదాం/ శృంగవరపుకోట

మధ్యాహ్న భోజనం పరిశీలన



వంటకాలను రుచి చూస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాలను ఎంఈఓ విమలమ్మ గురువారం పరిశీలించారు. వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. ఎంఈఓ వెంట హెచ్ఎం ఎం.వెంకటేశ్వరరావు, సీఆర్‌పీ రామసూరిరెడ్డి. ఉపాధ్యాయులు సత్యారావు, తదితరులు ఉన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ డే



ర్యాలీ చేస్తున్న స్కౌట్ యూనిట్ విద్యార్థులు

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కార్ఫ్ డేను గురువారం నిర్వహించారు. స్కౌటింగ్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్- పావెల్‌కు విద్యార్థులు ఘన నివాళి అర్పించి, ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం బి.పి.ఎ.రాజు, బేసిక్ స్కౌట్ మాస్టర్ పి.రమేష్ నాయుడు పాఠశాల నుంచి స్కౌట్ యూనిట్‌లో చేరిన 32 మంది విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు.